# చతుర్థాంకం

సన్నని వేళ్ళు తన్ని సన్నగా తట్టి లేపినట్లయితే, మెల్లగా కళ్ళు తెరిచాడు రామం.

పక్కనే కూర్చునుంది సీత. ఇరవై నాలుగేళ్ళ ఆరు నెలల రెండు రోజుల క్రితం పెళ్ళి పీటల మీదెలా ఉందో, అలానే ఉంది సీత.

అవే కళ్ళు, అదే నోరు, అదే జడ. నల్లగా, పొడుగ్గా, లావుగా ఉన్న జడ.




ఇన్నేళ్ళలోనూ సీత జడ లావూ తగ్గలేదు – సీత నడుం సన్నమూ తగ్గలేదు.

"టైమెంతయింది?" అన్నాడు రామం.

"పన్నెండున్నర" అంది సీత వాచీ చూడకుండా.

"మెలకువ వచ్చేసిందా?" అన్నాడు రామం సీత జడని చుట్టలా తన గుండెల మీద చుట్టుకుంటూ.

"అసలు నిద్రే పట్టలేదు" అంది సీత. అంటూ రామం చుట్టిన తన జడ చుట్ట మీద  తల వాల్చింది.

"ఎన్ని ఉపయోగాలో దీంతో" అన్నాడు రామం.

"మోసేవాళ్ళకి తెలుస్తుంది దేని బరువైనా?"

"తీగకి కాయా, తల్లికి పిల్లా, సీతకి జడా బరువా?"

చిన్నగా నవ్వింది సీత.

నవ్వినప్పుడు పడ్డ సొట్ట బుగ్గలనే చూస్తూ – "ఎందుకు నిద్ర పట్టలేదు సీతా?" అని అడిగాడు.

"ఏమో – " అంది సీత.

సీత 'ఏమో'కి అర్థం తెలియని వాడు కాదు రామం. అందుకే – "చెప్పవూ?" అని అడిగాడు.

"మనకి పెళ్ళయి ఎన్నాళ్ళయింది?" అడిగింది.

"ఇరవై నాలుగేళ్ళ ఆరు నెలల రెండు రోజులు" అన్నాడు రామం కంఠతా పడుతున్న రెండో ఎక్కాన్ని రెండో క్లాసు పిల్లాడు అప్పచెప్పినట్లు.

"అంటే – ఇంకో అయిదు నెలల, ఇరవై ఎనిమిది రోజులకి–" అని సీత మొదలెట్ట గానే –

"ఇరవై అయిదేళ్ళు పూర్తవుతాయి" అంటూ పూర్తి చేశాడు రామం.

"అంటే పాతిక సంవత్సరాలన్నమాట" అంది.

"అవును – సిల్వర్ జూబిలీ" అన్నాడు రామం.

"ఆ రోజుకి–" అంటూ ఆగింది సీత.

"ఊ– ఆ రోజుకి" అని అడిగాడు రామం.

కొంతసేపు ఏమీ మాట్లాడలేదు సీత. ఆ తర్వాత నెమ్మదిగా –

"మీ నిద్ర పాడుచేశాను. ఏదయినా మంచి కల వస్తుందేమో" అంది.

"కలలు కలలే – నిజాలు కావు. అయినా ఎంతటి కలయినా, సీత కన్నా అందంగా ఉండదు" – అని అన్న రామం మాటలకి –

"– మీకు" అని కలిపింది సీత.

"అవును నాకే – అయినా అసలు సంగతి వదిలేస్తావెందుకు? ఆ రోజుకి ఏం కావాలో చెప్పు. నెక్లెసా? వడ్డాణమా? నీ సన్నని నడుంకి వడ్డాణం చేయించడం కష్టం కాదు" అన్నాడు రామం.

"నగలేం కావు" అంది సీత.

"మరింకేం కావాలి?" అని అడిగాడు రామం.

"ఆ రోజు – నా పెళ్ళిరోజు – నా కూతురి పెళ్ళి రోజు కూడా కావాలి" అంది సీత.

"నీ పెళ్ళి రోజా? నీ కూతురా?" అన్నాడు రామం.

"అదే మన పెళ్ళిరోజు – మన కూతురు" అంది.

"బేబీకి పెళ్ళా?" అన్నాడు రామం.

"మనం బేబీ అని పిల్చినంత మాత్రాన అది బేబీగా ఉండిపోతుందా? దానికి ఇరవై మూడేళ్ళు" అంది సీత.

"ఇంకో రెండు మూడేళ్ళు ఆగచ్చునేమో" అన్నాడు రామం.

"ఇంకో పదేళ్ళు కూడా ఆగచ్చు" అంది సీత.

"ఎందుకంత వ్యంగ్యం సీతా! మొన్ననే గదా దాని చదువు పూర్తయింది. హాయిగా కొన్నాళ్ళు ఉద్యోగం చేసుకోనీ" అన్నాడు రామం.

"సంవత్సరం దాటుతోంది బేబీ ఉద్యోగం చెయ్యడం మొదలెట్టి. మీ ఆలోచన దాని ఉద్యోగం గురించి కాదు. దానికి పెళ్ళి చేసి పంపించడం మీకు కష్టం. అవునా?" అని అడిగింది సీత.

"అవునేమో" అన్నాడు రామం. అని, కొంత సేపు మౌనంగా ఉండి; "నీ ఇష్టం – నువ్వు చెప్పినట్లే చేద్దాం. సంబంధాలు చూద్దాం" అన్నాడు.

ఏ విషయంలో సీత చెప్పింది వినాలో తెలుసు రామానికి – అలానే సీతకీనూ.

'ఫలానా కంప్యూటర్ బావుంటుంది – కొందాం' అని రామం చెప్తే, సీత ఒప్పుకుం టుంది.

'కారుని దూరంగా ఉన్న మెకానిక్ దగ్గరకే రిపేరుకి తీసికెళ్ళ'మని రామం అంటే, అక్కడికే తీసుకెళ్తుంది సీత.

'అబ్బాయికి ఈ సారి జ్వరం ప్రతీసారిలా లేదు, స్పెషలిస్టు దగ్గరకు తీసుకువెళ్దాం' అని సీత అంటే అలానే చేస్తాడు రామం.

'అమ్మాయి ఎందుకో అదోలా ఉంది. కాలేజీలో ఏమైనా అయిందేమో కనుక్కో'మని సీత చెప్తే, అలాగే చేస్తాడు రామం.

ఏ విషయంలో ఎవరి మాట వినాలో ఇద్దరికీ తెలుసు. తెలుసునంటే ముందునుండే తెలుసునని కాదు – తెలుసుకున్నారు.

తెలుసుకుందుకు పాతికేళ్ళు తక్కువ సమయం కాదు. పాతికేళ్ళంటే ఎన్ని రోజులు? ఎన్ని గంటలు? ఎన్ని నిముషాలు? అంతకుమించి ఎన్ని అనుభవాలు? ఎన్ని అనుభూతులు?

అన్ని అనుభవాల్లో, అన్ని అనుభూతుల్లో కలిసి పయనించిన జీవితాలు వాళ్లవి.

రెండు వాగులు కలిసిన చోట, ఒక నీరు ఇంకో నీరుతో కలుస్తుంటే, అలజడి ఉంటుంది.

అలానే వాళ్ళ తొలి నాళ్ళలో సరదాల జగడాలు ఉండేవి. వాగులు రెండూ

ఒకటై ప్రవహిస్తోంటే – ఒక్క వాగు నీరే ప్రవహిస్తుంది. ఇప్పుడు వాళ్ళ జీవితమూ అంతే!

అందుకే సీత 'పిల్ల పెళ్ళిచేద్దాం' అంటే 'సరే'నన్నాడు రామం. రామానికి విడిగా అభిప్రాయం లేక కాదు. అయితే ఏది ఇద్దరికీ, కుటుంబానికీ మంచో రామానికి తెలుసు. సీతకీ తెలుసు.

❀ ❀ ❀

"వర్ధనిగారు ఫోన్ చేశారు" అంది సీత.

ఏమంటుంది?" అన్నాడు రామం.

"వాళ్ళబ్బాయికి మనమ్మాయిని చేసుకుంటారా అని అడిగారు" అంది సీత.

"నిజంగా?" అన్నాడు ఆనందంగా రామం.

"నిజంగానే" అంది – రామం ఆనందానికి ఆనందిస్తూ సీత.

"మన బేబీ ఎంత అదృష్టవంతురాలు సీతా! మనం ఇంకా పెళ్ళి సంబంధాలు చూద్దాం అనుకునేలోగానే – మంచి సంబంధం వెతుక్కుంటూ వచ్చేసింది. నువ్వేమన్నావు?" అన్నాడు రామం.

"మీతో మాట్లాడి చెప్తానన్నాను" అంది సీత.

"నాతో మాట్లాడడమెందుకు సీతా! సరే ననెయాల్సింది. వాళ్ళబ్బాయి నీకు తెలుసుగా – సుందర్ – పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు – బుద్ధిమంతుడు – బావుంటాడు" అని రామం అంటూంటే –

"సుందర్‌కి అమెరికాలో ఉద్యోగం వస్తోందిట. అయిదారు నెలలలో వెళ్ళిపోతాడుట. ఈలోగా పెళ్ళి చేసి, కోడలితో కొడుకుని అమెరికా పంపించాలని వర్ధనిగారి కోరిక" అంది సీత.

"సుందర్ అమెరికా వెళ్ళిపోతాడా? అంటే ఈ సంబంధం చేస్తే బేబీ కూడా..." రామానికి ఏం చెప్పాలో తెలియనట్లు ఆగిపోయాడు.

"పెళ్ళయితే ఇద్దరూ అమెరికాలోనే ఉంటారు" అంది సీత.

అలా అంటున్న సీత కళ్ళు తడవుతున్నట్లనిపించింది రామానికి.

"బేబీకి పెళ్ళి చేసి అమెరికా పంపించేద్దామా?" అని అడిగాడు రామం.

అలా అడుగుతున్న రామం కంఠం వణుకుతున్నట్లనిపించింది సీతకి.

కొంచెం సేపు ఇద్దరూ ఏమి మాట్లాడుకోలేదు.

"బేబీని అమెరికా పంపించెయ్యాలంటే, ఈ సంబంధం మనకొద్దు సీతా! ఇంకో మంచి సంబంధం చూద్దాం. మనకి దగ్గరగా కాకుండా బేబీ ఉండగలదా?" అన్నాడు

రామం.

"బేబీ ఉండగలదో, లేదో – మనం ఉండగలమా?" అని అడిగింది సీత.

"నువ్వుండగలవా?" అని అడిగాడు రామం.

"ఏమో!" అంది సీత.

"అంటే?" అన్నాడు రామం.

"ఉండగలనో, లేదో ఇప్పుడే ఏం చెప్పగలను? ఉండగలగాల్సి వస్తే – అప్పుడు తెలుస్తుంది".

"అసలు ఉండగలగాల్సిన పరిస్థితి ఎందుకు సీతా? వర్ధని ఏమి అనుకోదు – వద్దని చెప్పేద్దాం" అన్నాడు రామం.

"తమ పిల్లల కోసం సంబంధాలు చూసుకుంటున్న చాలామంది – అమెరికా సంబంధం దొరికితే బావుండుననుకుంటున్నారు. మనం, మన దగ్గరికి వచ్చిన అమెరికా సంబంధాన్ని వదిలేసుకుంటే – అందరూ నవ్వుకుంటారు" అంది సీత.

"ఎవరో నవ్వుతారని –" అని రామం ఏదో అనబోతుంటే –

"ఎవరో నవ్వుతారనే కాదు, ఈ సంబంధం వదిలేసుకుంటే మనమూ నష్టపోతామేమోనని" అంది సీత.

"మనమా?" అని అడిగాడు రామం.

"అవును మనం. మనం అంటే – మీరూ, నేనూ, బేబీ – ముఖ్యంగా బేబీ" అంది సీత.

"బేబీ అక్కడకెళ్ళి సుఖపడుతుందా?"అని అడిగాడు రామం.

"ఎందుకు పడదు? ఎందరు అక్కడ కెళ్ళి సుఖపడ్డంలేదు? అలానే బేబీనూ. అక్కడ కెళ్ళి రకరకాలుగా రాణిస్తున్నారు మన వాళ్ళు. అక్కడ ఏం చేసేందుకైనా అవకాశాలు ఎక్కువ. అందుకనే గదా అందరూ అక్కడ కెళ్తున్నది?" అంది సీత.

"సీతా! నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది?" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"తల్లితండ్రులం – మనం – మన స్వార్థం కోసం – బేబీకి ఈ సంబంధం చెయ్యకపోతే – బేబీకి ఓ మంచి సంబంధం – ఓ మంచి అవకాశం – పోగొట్టిన వాళ్ళం అవుతామేమోననిపిస్తోంది" అంది సీత.

"నిజం చెప్పు సీతా! నిజంగా నీకు బేబీ అంత దూరం వెళ్ళిపోతుందంటే బెంగగా లేదూ?" అని అడిగాడు రామం.

"ఎందుకు లేదు? అయితే ఏం చేద్దాం?"

"సుందర్‌కి నచ్చచెప్దాం" అన్నాడు రామం.

"అమెరికా వెళ్ళాలన్న కోరిక సుందర్‌కి ఎంత ఉందో నాకు తెలియదు. అయితే ఆ కోరిక బేబీకి చాలా ఉంది. దాని చదువుకి అక్కడ మంచి అవకాశాలున్నాయం టోందది" అలా అంటున్న సీత కళ్ళు తడయ్యాయి.

"అంటే – బేబీకి అమెరికా వెళ్లాలని ఉందా?" అని అడిగాడు రామం.

"అవును. ఒక్క మన బేబీనే కాదు. ఈ కాలంలో మంచి చదువూ, ఉద్యోగం కావాలనుకుంటున్న పిల్లలందరికీ అదే కోరిక. నిజానికి అది కోరిక కూడా కాదు. స్కూలు చదువు కాగానే కాలేజీలో చేరుతున్నట్లు కాలేజీ చదువు పూర్తవగానే, పై చదువులకో, ఉద్యోగాలకో అమెరికా వెళ్ళిపోతున్నారు. అది ఎంతో సహజంగా జరిగిపోతోంది" అంది సీత.

"పిల్లలలా వెళ్ళిపోతే మరి పెద్దవాళ్ళ సంగతి?" అని అడిగాడు రామం.

"నిజానికి చాలామంది పెద్దవాళ్ళే పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ కాలంలో మంచి సంబంధం అంటే – అమెరికా సంబంధమే" అంది సీత.

"అది సరే కాని – ఈ సంబంధం గురించి వర్ధని మాట్లాడిందన్నావు కదా – ఈ సంబంధం సుందర్‌కి ఇష్టమేనా?" అన్నాడు రామం.

"సుందర్ ఇష్టం తెలిశాకే ఆవిడ ఫోన్ చేశారుట" అంది సీత.

"మరి మన బేబీకి సుందరంటే ఇష్టమేనా?" అని అడిగాడు రామం.

"తెలియదు – కనుక్కోవాలి" అంది సీత.

"కనుక్కో. బేబీ ఏమంటుందో? అది ఏమంటే మనం అదృష్టవంతులమో – అవునంటేనో – కాదంటేనో?" అన్నాడు రామం.

"ఏమో" అంటూ రామం ఒళ్ళో తల దూర్చింది సీత!

సీత జడ మీద తల వాల్చాడు రామం!

❋ ❋ ❋

ట్యూబ్‌లైట్ ఆపేసి, బెడ్‌లైట్ వేసి, రామం పక్కనే పడుక్కోంటూ –

"దానికి అతనంటే ఇష్టమేనట" అంది సీత.

"భాషలో నామవాచకాలూ, సర్వనామాలూ అని రెండు ఉన్నాయి. అసలు నామవాచకాలే లేకుండా, సర్వనామాలే వాడితే ఎలా? దానికంటే ఎవరికి? అతనంటే ఎవరు?" అన్నాడు రామం.

"దానికన్నమాట దానికెవరికో అయితే మీ కెందుకు చెప్తాను? దానికంటే బేబీకి – అతనంటే సుందర్. సుందర్‌కి మన బేబీ అంటే ఎలానో – అలానే మన బేబీకి కూడా సుందర్ అంటే ఇష్టమేనట" అంది సీత.

రామం వెంటనే ఏమి మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తెలియలేదు. ఇరవై మూడేళ్ళు వచ్చినా, బేబీ రామం దగ్గర మూడేళ్ళ పిల్లలానే ఉంటుంది. రామం సోఫాలో కూర్చుంటే, అతని ఒళ్ళో తల పెట్టుకు పడుకుంటుంది. బయటికి ఎక్కడికి వెళ్ళినా రామం చెయ్యి పట్టుకునే నడుస్తుంది. అలాంటి బేబీ తను ఓ మగాడ్ని ఇష్టపడుతోందని సీత చెప్తోంటే రామానికి నమ్మకం కుదరలేదు.

బేబీకి పెళ్ళి చేసి పంపించడమే కష్టం అనుకుంటున్న రామానికి, బేబీ, తానింక బేబీని కాదని చెప్తున్నట్లనిపించి, ఇంకా కష్టంగా తోచింది.

"కన్నతల్లివి – నీ క్కూడా ఈ విషయం చెప్పలేదా?" అన్నాడు.

"అది పెద్దదయింది. దాని మంచిచెడులు అది చూసుకుంటుంది. దానికి ఇష్టమైన సంబంధం చెయ్యడమే మన కర్తవ్యం" అంది సీత.

"మనం ఈ పెళ్ళి జరిపించాలని ఏముంది? ఈ పెళ్ళి చెయ్యద్దు మనం' అన్నాడు కోపంగా రామం.

సీత నవ్వింది. ఆ నవ్వులో –

'మీకూ కోపమా?' అన్న ఆశ్చర్యం ఉంది.

'పిల్లను కోప్పడద్దు' అన్న అర్థింపు ఉంది.

'కోప్పడి ఏం చెయ్యగలరు?' అన్న జాలి చూపు ఉంది.

ఇన్ని భావాలు ఒక్కసారే తన నవ్వులో చూపించగలగడం – అంత బాధలోనూ నవ్వడం – ఒక్క సీతకే సాధ్యం అనుకున్నాడు రామం.

నవ్వుతూనే సీత – "కణ్వుడు ఆశ్రమంలో లేని సమయంలో శకుంతల దుష్యంతుడిని ప్రేమించడమే కాదు – గాంధర్వ వివాహం కూడా చేసుకుంది. ఆ వివాహ విషయం తెలిసిన కణ్వుడు దూర్వాసుడు కాలేదు. తను పెంచి పెద్ద చేసిన పిల్ల తనకి చెప్పకుండా పెళ్ళి చేసుకుందని ఆగ్రహించలేదు సరికదా – సరైన వరుణ్ణి చూసుకుందని సంతోషించాడు" అంది సీత.

"కణ్వుడు మహర్షి. దుష్యంతుడు సద్గుణ సంపన్నుడు. కాళిదాసు మహాకవి" అన్నాడు రామం మూడు సత్యాలను ఆవిష్కరిస్తున్నట్లు.

"మీరన్న మూడు వాక్యాలలోనూ మూడవదొక్కటే సత్యం. మొదటి రెండూ అసత్యాలే. కణ్వుడేం మహర్షి? అంతటి మహర్షే అయితే, శకుంతలను అత్తారింటికి పంపిస్తూ ఏడుస్తాడా? దుష్యంతుడు సద్గుణసంపన్నుడా? అలాంటి వాడు తను కట్టుకున్న భార్యను గుర్తించడా? కాళిదాసు మాత్రం గొప్పకవి. అందుకే దుష్యంతుడి దుర్గుణానికి, దూర్వాసుడి మంత్రపు మసి పూసి మతి మరుపు మారేడుకాయను

చేశాడు" అంది సీత.

"ఇప్పుడు మనం కణ్వుడి గురించి కాదు మాట్లాడుకోవలసింది" అన్నాడు రామం.

"నిజానికి మనం మాట్లాడుకోవల్సింది కణ్వుడి గురించే. అదొదిలెయ్యండి. బేబీ సుందర్‌ని ఇష్టపడుతోంది. సుందర్‌కీ బేబీ అంటే ఇష్టమే. వర్ధనిగారే ఈ సంబంధం గురించి అడిగారు" అని సీత అంటూంటే --

"నీకీ సంబంధం బాగా ఇష్టం లాగుందే" అన్నాడు రామం.

"ఈ పెళ్ళి చేసుకుంటే పిల్ల సుఖపడుతుందనిపిస్తోంది నాకు" అంది సీత.

"నిజం చెప్పు సీతా! నీకీ సంగతి ముందే తెలుసా?" అని అడిగాడు రామం.

"ఏం సంగతి?" అంది సీత.

"బేబీకి సుందర్ అంటే ఇష్టమన్న సంగతి" అన్నాడు రామం.

సీత తల వంచుకుంది. వంచుకుని కళ్ళెత్తి రామాన్ని చూసింది.

రామం సీతనే చూస్తున్నాడు. పాతికేళ్ళ క్రితం ఎలా చూశాడో, అలానే చూస్తున్నాడు. ఆ కళ్ళలో అదే ప్రేమ. అదే ఆరాధన. అదే నమ్మకం.

"నీకు చెప్పి నిన్ను కష్టపెట్టడం ఇష్టంలేక..." అంటూ ఆగింది సీత.

గౌరవార్థక బహువచనం నుండి, ఆత్మీయార్థక ఏకవచనంలోకి సీత దిగినప్పుడల్లా, సీతకి రామం - పాతికేళ్ళకి ముందు రామంలా కనిపిస్తాడని రామానికి తెలుసు. అందుకే -

"సీతా!" అన్నాడు సీతనే చూస్తూ.

"ఊ" అంది, సీతకే సాధ్యమయ్యేలా సీత.

"వర్ధనితో ఫోన్లో నువ్వు మాట్లాడుతావా? బావగారితో నేను మాట్లాడనా?" అని అడిగాడు రామం.

"నా కోసం ఒప్పుకొంటున్నారా?" అంది సీత.

"బేబీ సుఖపడుతుందని నీకు అనిపిస్తే - నాకూ అదే అనిపిస్తోంది" అన్నాడు రామం.

"అసలు మీకేమనిపిస్తోంది?" అంది సీత.

"ఇంతకుముందు ఏమీ అనిపించలేదు. ఇప్పుడు మాత్రం నీకేమనిపిస్తోందో - అదే అనిపిస్తోంది" అన్నాడు రామం.

"మీరెంత..." అని సీత మొదలెట్టగానే -

"మంచివారంటే - నువ్వు బావున్నంత, నువ్వెంత బావున్నావంటే నీ..." అని రామం అంటూండగానే -

"...జడంత" ముగించేస్తూ పక్కకి తిరిగింది సీత.

రోజుకి ఎన్నిసార్లు తన అందం గురించి ప్రస్తావన వస్తే, అన్నిసార్లు ఆనందించే సీత జడ – పాతికేళ్ళగా వచ్చిన ప్రస్తావనలన్నీ కలిపి కూడా తనలోని వెంట్రుకలన్ని లేవని – బాధగా, గర్వంగా – సీతతో పాటు పక్కకి తిరిగింది.

❁ ❁ ❁

"ఇంకొక్కరోజు. వెళ్ళిపోతుంది బేబీ" అన్నాడు రామం.

"ఇన్నాళ్ళూ పనుల హడావిడిలో తెలియలేదు. దాన్ని పంపే రోజు వచ్చేసింది" అంది సీత.

"మన పాతికేళ్ళ పెళ్ళి రోజునే దాని పెళ్ళి చెయ్యాలని ఒకటే తొందర చేసిందానవు నువ్వు. అప్పుడే తొందరెందుకని నేనన్నా వినిపించుకోలేదు" అన్నాడు రామం.

"మనం చేసింది తప్పని అనుకోవడం లేదు నేను. ఆడపిల్లకి పెళ్ళి చెయ్యకా తప్పదు. అల్లుడితో పంపించకా తప్పదు" అంది సీత.

"ఇన్నేళ్ళూ మన పిల్ల – ఇంక మీదట...." అంటూ ఆగాడు రామం.

"ఇంక ముందూ మన పిల్లే – అయితే..." అంది సీత, ఇంకేమనాలో తెలియక.

"ఆ 'అయితే'నే బాధిస్తోంది. మనకే ఇలాగుంటే – దానికి ఎలాగుందో? మనల్ని వదిలి అంత దూరం వెళ్ళాలి" అన్నాడు రామం.

"దానికేం – అది సరదాగా, హాయిగా తిరుగుతోంది" అంది సీత.

"లేకపోతే, అతని ముందు కూర్చుని ఏడుస్తుందా?" అన్నాడు రామం.

"పెళ్ళయి వారం అవుతోంది. రోజూ ఎక్కడికో ఒకచోటకి వెళ్లి వస్తోంది" అంది సీత.

"అది పుట్టి పెరిగిన ఊరిది. ఊరి నిండా స్నేహితులే. అందరి దగ్గరకూ తీసుకువెళ్తోంది. అలానే దాని స్కూలూ, కాలేజీ, అది చిన్నప్పటినుండీ తిరిగిన పార్కులూ, గుళ్ళూ, బీచ్ – అన్నీ చూపిస్తోంది. నిన్న నేనూ వాళ్ళతో వెళ్ళానుగా గుడికి. గుళ్ళో చిన్న ఏనుగుల బొమ్మలున్నాయి చూడు. వాటి దగ్గరే కూర్చున్నాం. ఎంతసేపు చెప్పిందో – చిన్నప్పుడు తను వాటి మీద కూర్చుని ఆడుకోవడం గురించి. అప్పుడంత పెద్దగా అనిపించిన ఏనుగులు. ఇప్పుడెంతో చిన్నగా అయిపోయాయంది. నాకు చిన్న చిన్న గౌన్లు వేసుకుని తిరిగిన పిల్లే గుర్తుకు వచ్చింది. అది పెద్దవకుండా అలానే ఉండిపోతే బాగుండుననిపించింది" అన్నాడు రామం.

"నాకూ అంతే. మొన్న మేం ముగ్గురం బీచ్‌కి వెళ్ళాం కదా. మా అమ్మ నన్ను చెయ్యి పట్టుకుని అలల్లో నిలపెట్టేదని చెప్తూ, నా చేతులు పట్టుకుని అలల్లో నిల్చుంది.

సుండల్, మురుకులూ అడిగి నా చేత కొనిపించుకుంది. దాని దగ్గర డబ్బులు లేక కాదు – నేను కొనిపెడితే బావుంటుందని. నాకూ అదే అనిపించింది. అది చిన్నపిల్లలా అలా ఉండి పోయుంటే – ఈ రోజు – దాన్నిలా పంపాల్సిన అవసరం వచ్చేది కాదని" అంది సీత.

"అది వెళ్ళిపోతే ఎలా ఉంటాం సీతా!" అన్నాడు రామం.

"మీకు గుర్తుందా – దానికి మూడేళ్ళప్పుడు దాన్ని స్కూల్లో చేర్చాం. అప్పుడు మనం తప్ప మరో లోకం లేదు దానికి. అలాంటి పిల్లని స్కూల్లో దింపేసి వస్తుంటే, నేనూ వచ్చేస్తానని గట్టిగా ఏడ్చింది – గుర్తుందా మీకు? అయినా అక్కడే వదిలేసి వచ్చాం. అంత చిన్న పిల్ల మనల్ని వదిలి ఉండగలదో, లేదోనని మనస్సు బాధపడుతున్నా, ఇంటికి వచ్చేశాం. ఇంటికొచ్చి ఎంత ఏడ్చానో నేను. మీరైతే ఆఫీసుకు వెళ్ళలేకపోయారు. అంత కష్టపడుతూ ఎందుకు స్కూల్లో వదిలేశాం? దాని మంచి కోసం – దాని భవిష్యత్తు కోసం. ఆ తర్వాత దానికి స్కూలు అలవాటైపోయింది. ఎప్పుడన్నా మనం మానమన్నా స్కూలు మానేది కాదది. మనకీ అలవాటైపోయింది. ఇదీ అంతే" అంది సీత.

"దానికీ, దీనికి పోలికేంటి సీతా! – అది కొన్ని గంటలు స్కూలుకి వెళ్ళి రావడం – ఇది – ఇది – మనల్ని వదిలి ఇంకొకరితో వెళ్ళిపోవడం – మన గురించే కాదు – దాని గురించి ఆలోచించు. సుందర్ తెలిసినవాడే కావచ్చు. ఇష్టపడ్డ వాడే కావచ్చు. అయినా అతనితో వెళ్ళి అక్కడ ఎలాగుంటుందో? మన దగ్గర గారాబంగా పెరిగిన పిల్లని అతను ఎలా చూస్తాడో? ఏదన్నా అంటాడేమో – అంటే అది ఎలా తట్టుకుంటుంది?" అన్నాడు దిగులుగా రామం.

"ఆ మాటే చెప్తున్నాను దానికి. జాగ్రత్తగా ఉండు బేబీ – అమ్మా నాన్నల దగ్గర ఉన్నట్లు కాదు – అతనికి కావల్సినవి చూసి చెయ్యి – అతనికి కావాల్సినట్లుండు – అప్పుడే నీ జీవితం, అతని జీవితం సుఖంగా ఉంటాయని. నేను చెప్పిందంతా వింటోంది. వింటూ నవ్వుతోంది. నాదంతా చాదస్తం అనిపిస్తోంది దానికి. నన్నో అమాయకురాలిని అనుకుంటోంది. ఇవన్నీ నాకు తెలియవా అన్నట్లు చూస్తోంది" అంది సీత.

"నన్నూ అలానే చూస్తోంది. నేను దానితో కాదు – అతనితోనే మాట్లాడాను. పెళ్ళయ్యాక అప్పగింతల తంతు జరిగింది చూశావూ – అప్పుడు – అప్పుడు దాన్ని – వాళ్ళకి అప్పగించేస్తున్నామన్న ఆలోచన భారంగా అనిపించి – అతనితో – 'బాబూ – గారాబంగా పెంచుకున్న పిల్ల – అది తెలిసో, తెలియకో తప్పు చేసినా

నువ్వేమి అనుకోకు – దాన్నేమీ అనద్దు – నీకుకావల్సినట్లు దాన్ని మలచుకో' – అని చెప్పాను. ముందుగా – అలా చెప్పాలని నేననుకోలేదు. అయినా నేననుకోకుండా – అప్రయత్నంగా – నా గుండెలోని బాధ ఆ మాటల రూపంగా బయటికి వచ్చేసింది. ఆ మాటలు నేననడం వింది బేబీ. విని నన్ను దగ్గరకు తీసుకుంది – నేను దానికి తండ్రిలా కాక, నాకది తండ్రిలా. దానికి అంత పెద్దరికం, హుందాతనం ఎలా వచ్చాయో. అసలు వచ్చాయా? లేక, లోపల బాధపడుతూ,పైకి అలా ఉంటోందా?" అని అడిగాడు రామం.

"పాతికేళ్ళ క్రితం నా గురించి మా నాన్న ఏమనుకొని ఉంటారో ఇప్పుడర్థమవుతోంది నాకు" అంది సీత.

"అంటే" – అని అడిగాడు రామం.

"మీకు అర్థం కాదు – ఎప్పటికీ అర్థం కాదు" అంది సీత.

"ఏంటీ–" అన్నాడు రామం.

"ఇప్పటి బేబీ ప్రవర్తన – అప్పటి నా ప్రవర్తన" అంది సీత.

❋ ❋ ❋

"వెళ్ళిపోయింది బేబీ – మళ్లీ ఎప్పుడొస్తుందో – ఈ దేశంలో ఉండి ఉంటే, కొన్నాళ్ళో, కొన్ని నెలలో అనుకోవచ్చు. అమెరికా – ఓ సంవత్సరం దాకా నైనా రాకపోవచ్చు" అన్నాడు రామం కార్లో కూర్చుంటూ.

"ఇక్కడ నుండి ఓ రోజు ప్రయాణం అమెరికా" అంది సీత, రామం పక్కనే కార్లో కూర్చుంటూ.

"ఏం చేద్దాం?" అన్నాడు రామం.

"ఇంటికి వెళ్దాం" అంది సీత.

"బేబీ లేని ఇంటికి వెళ్ళాలంటే భయంగా ఉంది" అన్నాడు రామం కారుని స్టార్ట్ చేస్తూ.

"ఎవరైనా, ఎప్పటికైనా చేరుకోవాల్సింది వాళ్ళింటికేగా" అంది సీత.

రామం కారుని నడుపుతూ–

"వెళ్ళిపోతూ కూడా బాధపడలేదు బేబీ" అన్నాడు

"నిన్న మీతో అన్నాను. అది అలా వెళ్ళడం మీకు అర్థం కాదని" అంది సీత.

"ఏంటి సీతా నువ్వనేది – తొమ్మిది నెలలు మోసి కన్నావు నువ్వు దాన్ని – అది పసిపిల్లగా ఉన్నప్పుడు దాని అవసరాలన్నీ తీర్చావు – దాన్ని పెంచి పెద్దదాన్ని చేశావు – అలాంటి నిన్ను వదిలి వెళ్ళిపోతుంటే దానికి బాధగా ఉండదూ? మనల్ని వదిలి

వెళ్ళిపోతున్నట్లే అనిపించదా దానికి?" అని రామం అంటుంటే, సీత మాట్లాడకుండా కారు సీటుకి తల ఆనించి, కళ్ళు మూసుకుని కూర్చుంది.

సీత చేతిని తన చేతిలోకి తీసుకోబోతున్న రామంతో, "నేనేం బాధపడడం లేదు" అంది సీత.

"మరి అలా కళ్ళు మూసుకుని కూర్చుంటావెందుకు? ఏదన్నా మాట్లాడు" అన్నాడు రామం సీత నిశ్శబ్దాన్ని సహించలేనట్లు.

సీత మాట్లాడసాగింది.

"మనం దాన్ని విమానం ఎక్కించడానికి వస్తున్నప్పుడే చెప్పిందది – ఏడవడాని కయితే ఎయిర్‌పోర్ట్‌కి రావద్దని. మనం విన్లేదు. దాన్ని పంపించేటప్పుడు మనమింత బాధపడతామని తెలియదా మనకు? తెలుసు. తెలిసే వచ్చాం. అది ప్రయాణం హడావిడిలో ఉంది. దాని ధ్యాసంతా ఒక్కదానిమీదే – సుందర్‌తో కలిసి ప్రయాణం చెయ్యడం మీదే. దాని మనస్సులో మరో భావం లేదు"

సీత కళ్ళు మూసుకుని మాట్లాడుతోంది. తన పక్కనుండి వస్తున్న ఆ మాటలు ఎంతో దూరాన్నుండి వస్తున్నట్లు గంభీరంగా, మృదువుగా వినిపిస్తున్నాయి రామానికి. సీత చెప్తున్నది మంత్రముగ్ధుడిలా వింటున్నాడు రామం.

"బేబీకి మనమంటే ఇష్టం లేక కాదు. మనం దాన్ని పెంచడం దానికి గుర్తు లేక కాదు. అయితే దాని మనస్సుకి రెక్కలొచ్చాయి. రెక్కలొచ్చిన పక్షి ఎగిరిపోవడం సహజం.

పెళ్ళి చేసుకోవడం, మొగుడితో కొత్త గూటికి చేరుకోవడం ఆడపిల్లలకి ఎంతో సహజంగా, సామాన్యంగా జరిగిపోతాయి. ఆ సమయంలో అమ్మా నాన్నల్ని వదిలి వెళ్ళిపోతున్నామన్న బెంగ వాళ్ళని కృంగతియ్యదు. కొత్త చోటులో ఎలా ఉంటుందో నన్న భయం వాళ్ళని భయపెట్టదు.

"ఆ స్థితిని వర్ణించడం కష్టం – దాన్ని అనుభవించాల్సిందే – అది మీ అనుభవం లోకి రాదు –

"ఆడవాళ్ళకి కొన్ని దురదృష్టాలతో పాటు కొన్ని అదృష్టాలను కూడా ఇచ్చాడు సృష్టికర్త. పుట్టబోయే పాపాయి కదలికల్ని అనుభవించగలరు ఆడవాళ్ళు. భర్తతో కొత్తగూటికి చేరుకునే అనుభవమూ వాళ్ళదే. ఆ గూటి మీద ప్రేమ పెంచుకుని, దాన్ని స్వంతం చేసుకుని, ఆ గూటి నుండి ఎగిరిపోబోయే పిల్లల్ని కనగలరు – పెంచగలరు"

పెళ్ళి కాక ముందు మరదలూ, తర్వాత భార్యా, అయిన సీత – కృష్ణుడిలా

జీవిత సారాన్ని బోధిస్తోంటే – అర్జునుడిలా వింటున్నాడు రామం.

వింటున్న రామం కళ్ళకి సుందర్ చేతుల్లో చేతులుంచుకుని ఎయిర్‌పోర్టులోకి వెళ్తున్న బేబీ కనిపిస్తోంది. బేబీ కళ్ళు కనిపిస్తున్నాయి. ఆ కళ్ళలో మెరుపు కనిపిస్తుంది.

గమ్యం చేరిన తృప్తితో మెరుస్తున్న కళ్ళవి. జీవితాంతం ఉండేందుకు తోడు దొరికిందన్న ఆనందంతో మెరుస్తున్న కళ్ళవి.

ఆ మెరుపుని అంతకు ముందు చూశాడు రామం. పాతికేళ్ళ క్రితం సీత కళ్ళలో అదే మెరుపు కనిపించింది. ఈ రోజు బేబీ కళ్ళలో ఆ మెరుపే కనిపించింది. సీత తనతో వచ్చేసింది. బేబీ సుందర్‌తో వెళ్ళిపోయింది.

రామానికి ఏదో అర్థమైనట్లనిపించింది.

❋ ❋ ❋

"మేం బానే ఉన్నామమ్మా – మా కోసం నువ్వేం బాధపడకు – నిన్న నువ్వు వెళ్ళిపోతోంటే ఏడుపు వచ్చింది – అంతే – ఇప్పుడు ధైర్యంగా ఉన్నాం – నాన్నగారితో ఇంకా ఏదన్నా మాట్లాడాలా – ఏం లేదా – అయితే ఫోన్ పెట్టెయ్యనా? అలవాటయే వరకూ రెండు మూడు రోజులకోసారయినా ఫోన్ చేస్తుండు – బై" అంటూ సీత ఫోన్ పెట్టెయ్యగానే –

"దానికక్కడ బావుందిట. చుట్టుపక్కల కొందరు ఇండియన్స్ ఉన్నారుట. దగ్గర్లోనే దాని ఫ్రెండ్ ఉందిట" అని ఉత్సాహంగా చెప్పాడు రామం.

"ప్రయాణమంతా హాయిగా అయిపోయిందిట. మధ్యలో లండన్ కూడా చూసిందిట. సుందర్ దారి పొడుగునా దాన్ని బాగా చూసుకున్నాడట" అంది సీత.

"పాతికేళ్ళ క్రితం నువ్వు నాతో రైల్లో వచ్చేశావు. ఇప్పుడు బేబీ విమానంలో సుందర్‌తో వెళ్ళిపోయింది" అన్నాడు రామం.

"అవును. అప్పుడు మీరు నన్ను బాగా చూసుకున్నారు...." అంది సీత.

"ఇప్పుడు నువ్వు నన్ను చూసుకుంటున్నావు" అన్నాడు రామం.

సోఫాలో కూర్చున్న రామం ముందు నేల మీద కూర్చుని, అతని ఒళ్ళో తల పెట్టుకుని –

"దాని పెళ్ళి రోజూ, నా పెళ్ళి రోజూ ఒక్కరోజే. నాకు దొరికినట్లే – దానికీ ఓ రాముడు దొరకాలని, రాముణ్ణి కోరుకుంటున్నాను. దాని జీవితమూ – నా జీవితంలా సుఖంగా సాగిపోవాలి" అంది సీత.

"సీతా!' అన్నాడు రామం సీత జడని తన పెదవులకు తాకించుకుంటూ.

"ఊఁ" అంది సీత తనకి మాత్రం సాధ్యమయ్యేలా.

"బేబీ లేదని బాధపడుతున్నావా?" అని అడిగాడు రామం.

"బాధగా ఉంది. ఆనందంగా కూడా ఉంది. ఇది మధురమైన బాధ. బావుంది" అంది సీత.

"బావుంటే?" – అని అడిగాడు రామం.

"పెళ్ళాడచ్చు" అంది సీత నవ్వుతూ.

"అది పెళ్ళికి ముందు – ఆ తర్వాత?" అన్నాడు రామం.

"ఇదిగో – ఇలా కూర్చోవచ్చు" అంది సీత.

"ఎంత దూరం వచ్చాం సీతా!" అన్నాడు రామం.

"నాలుగో అంకంలోకి" అంది సీత.

"నాలుగో అంకమా?" అని అడిగాడు రామం.

"పెళ్ళికి ముందుది మొదటి అంకం. పెళ్ళయినప్పట్నుంచీ పిల్లలు పుట్టేదాకా రెండో అంకం. పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యడం మూడో అంకం. వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసి పంపించేశాక – ఇదిగో – ఇది నాలుగో అంకం" అంది సీత.

"మన జీవన నాటకంలోనా?" అన్నాడు రామం.

"మనదైనా – మరెవరిదైనా అంతే" అంది సీత.

"ఇంక మనిద్దరమే ఒకరికొకరం" అన్నాడు సీతని ఒళ్ళో ఇంకా దగ్గరకి లాక్కుంటూ రామం.

"మనవడో, మనవరాలో పుట్టేదాకా" అంది.

"బేబీ పురిటికి అమెరికా వెళ్ళాలి నువ్వు" అన్నాడు రామం.

"నేనా? అమెరికాకా?" అంది సీత.

"మరి, బేబీ పురిటికి ఇక్కడకి వస్తుందేమిటి?" అన్నాడు రామం.

"అయితే, నేనొక్కదాన్నే వెళ్ళాలా?" అంది సీత, రామాన్నే చూస్తూ.

"నీ వెనకే నేనూను" అన్నాడు రామం.

"నా వెనుక మీరా? మీ వెనుక నేనా?" అని అడిగింది సీత.

"నీ వెనుక నేనూ కాదు. నా వెనుక నువ్వూ కాదు. నీతో నేను, నాతో నువ్వు. ఇద్దరం కలిసి" అన్నాడు రామం.

"అయినా ఏం చెప్పగలం – బేబీ డెలివరీకి ఇక్కడికే వస్తుందేమో – చాల రోజులైంది డాబా మీద కూర్చుని – పైకి వెళ్దామా?" అని అంటూ లేచి నడవసాగింది సీత.

సీతతో పాటే కదిలింది సీత జడ.

దాంతో పాటే – ❁